క్లుప్తంగా

శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ తాటియా గార్డెన్‌లో ఈనెల 7వ తేదీన జిల్లా కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ కార్యకర్తలకు ఉదయం 11 గంటలకు నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ జాతీయ నాయకులు కొప్పుల రాజు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. శిక్షణా కార్యక్రమానికి జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ప్రతీ ఒక్కరికి పని కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న అజీజుద్దీన్

వాంకిడి: జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతీ ఒక్కరికి పని కల్పించాలని ఎంపీవో అజీజుద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇందాని, నవేగూడ గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. ఉపాధి హామీలో పని చేసే కూలీలకు రోజు వారి కూలి రూ.300 ఉందని, ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పెరుగుతున్న ఎండల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రేపు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో వచ్చే విద్యా సంవత్సరంలో 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశం కోసం 7న అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. 6వ తరగతికి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతికి మధ్యాహ్నం 2గంటల నుంచి 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. మొత్తం 1526 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని భుక్తాపూర్ అంగన్‌వాడీ– 7 టీచర్ అన్మోల్‌వార్ కవిత అన్నారు. శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్యవసరమైతే తప్పా ఇంటి నుంచి బయటకు రావద్దన్నారు. ఉదయం, సాయంత్రం పూట మాత్రమే పనులు చేసుకోవాలన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రామాయి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న రామాలయం నిర్మాణానికి శుక్రవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరై ప్రత్యేక పూజలు పనులు ప్రారంభించారు. రామ మందిర నిర్మాణానికి గ్రామస్తులు కృషి చేయడం అభినందించారు. కార్యక్రమంలో రామాయి ఎంపీటీసీ మహేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని మసీదులో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మహబూబ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కానిందే ఉద్దవ్, జల్కే పాండురంగ్, బత్తిని కిషన్, సూర్యవంశీ పాండు, ఇర్ల శివుడు, జగదీష్, రమణ, విఠల్, రమేశ్, గాజుల పోతన్న పాల్గొన్నారు.

7న కవి సమ్మేళనం

ఆదిలాబాద్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఐత్యారం ముచ్చట్లు కవుల సంఘం సభ్యులు నిమ్మల ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు ఏదైనా సామాజిక అంశంపై కవితలు చెప్పవచ్చన్నారు. వివరాలకు 98486 43669, 93467 27719 సంప్రదించాలని కోరారు.

పురస్కారాల ఎంపిక కమిటీలో చోటు

ఆదిలాబాద్‌టౌన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మేఘా సిటీ నవకళా వేదిక, ప్రభుత్వం సంయుక్తంగా ఉగాది విశిష్ట పురస్కారం అందిస్తుంది. ఈ పురస్కారాలు ఎంపిక చేసే కమిటీలో జిల్లా న్యాయవాది సుధీర్ కుమార్ సంగెంకు చోటు దక్కింది. ఈనెల 8న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ రావు, బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణ మోహన్ రావ్, దైవజ్ఞ శర్మలు పురస్కారాలు అందజేయనున్నారు.



తలోడిలో సాగవుతున్న మొక్కజొన్న

మొక్కజొన్న.. లాభాలు మిన్న!

- ఆరుతడి పంటవైపు రైతుల మొగ్గు
- ఆశాజనకంగా మొక్కజొన్న పంట

కౌటాల: రబీ సీజన్‌లో ఆరుతడి పంటల్లో మొక్కజొన్నకు రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. తక్కువ పెట్టుబడి, కొద్దిపాటి నీటితో పండే మొక్కజొన్న సాగుకు రైతులు పెద్దపీట వేస్తున్నారు. రబీ రారాజుగా పేరు పొందిన మొక్కజొన్న సాగుతో పశుగ్రాసం కొరత తీరడమే కాకుండా అధిక దిగుబడులు సాధించి లాభాల బాట పడుతున్నారు.

ఆరుతడి పంటల వైపు..

ఈసారి ఖరీఫ్‌లో అనావృష్టి కారణంగా వరి, సోయా, కంది, పత్తి పంటలకు పలు రకాల చీడ పురుగులు ఆశించడంతో అనుకున్న స్థాయిలో పంటల దిగుబడి రాలేదు. దీంతో ఖరీఫ్ పంటలతో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులు వ్యవసాయ బావుల ఆధారంగా యాసంగిలో వివిధ పంటలు సాగు చేశారు. ఇక జిల్లాలోని వాంకిడి, రెబ్బెన, కెరమెరి, దహెగాం, తిర్యాణి, కౌటాల, సిర్పూర్(టి), బెజ్జూర్, చింతలమానెపల్లి తదితర మండల్లాలో రైతులు ఆరుతడి పంటలు అధిక మొత్తంలో సాగు చేస్తున్నారు. జిల్లాలోని రైతులు అధికంగా 17,369 ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తుండగా.. 7,791 ఎకరాల్లో జొన్న, 4,684 ఎకరాల్లో శనగలు, 1913 ఎకరాల్లో మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారు. అలాగే పెసర, గోధుమలు, వేరుశనగ, నువ్వులతో పాటు ఇతర ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 35 వేలకు పైగా ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. యాసంగిలో సాగు చేస్తున్న పంటల్లో ప్రస్తుతం వరి, మొక్కజొన్న పంటలు కోత దశకు వచ్చాయి.

తీరనున్న పశుగ్రాసం కొరత..

మొక్కజొన్న పంట సాగుతో పశుగ్రాసం కొరత తీరుతోంది. పంట చేతికందిన తరువాత మొక్కజొన్న కర్రలు పశుగ్రాసంగా ఉపయోగపడుతున్నాయి. మొక్కజొన్న పంటలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఆశాజనకంగా..

యాసంగి సీజన్‌లో జిల్లాలో సాగు చేస్తున్న పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. మొక్కజొన్నతో అధిక ఆదాయం వస్తుందని భావించిన రైతులు ప్రస్తుత సీజన్‌లో 2వేలకు పైగా ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. మొక్కజొన్న కంకి కండె దశకు చేరింది. ఇప్పటి వరకు తెగుళ్ల సమస్యలు అంతగా లేవని రైతులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అడవి పందుల బెడద రైతులను కొంత ఇబ్బంది పెడుతోంది. అయితే అడవి పందుల సమస్యను అధిగవించడానికి రైతులు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. చేను వద్దే మంచె వేసుకొని రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు. పందులు చేనులోకి చొరబడకుండా కంచెలు ఏర్పాటు చేసుకున్నారు. పందులను భయపెట్టేందుకు రకరకాల చప్పుళ్లు చేస్తున్నారు. దీంతో పందులు పంటల చేలవైపు రావడం లేదు. మొక్కజొన్న పంట ఏపుగా పెరిగి, కంకి బలంగా వస్తుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నీళ్లున్నాయని సాగు చేశా..



మా వ్యవసాయ బావిలో నీళ్లున్నాయి. దీంతో యాసంగిలో మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నా. ప్రస్తుతం బావిలో పంటకు సరిపడా నీళ్లు ఉన్నాయి. ప్రస్తుతం మొక్కజొన్న పంట చేతికి వచ్చే దశలో ఉంది. ప్రభుత్వం మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి.
– శ్రీనివాస్, రైతు, తలోడి

రెండెకరాల్లో పంట



నేను రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ప్రస్తుతం మొక్కజొన్న పంట ఏపుగా పెరుగుతుంది. ఆరుతడి పంటల సాగుతో పంటకు ఉదయం, రాత్రి కాపలా ఉంటున్నాను. విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తే నీటి సమస్య కూడా ఉండదు.
– ఆనంద్‌రావు, యాపలగూడ

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

పెంచికల్‌పేట్: ఏనుగు దాడిలో మృతి చెందిన కొండపల్లి గ్రామానికి చెందిన కారు పోశన్న కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఏనుగు దాడిలో రైతు మృతి చెందడం బాధకరమన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట నియోజకవర్గ పరిశీలకుడు అనిల్‌గౌడ్, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల అధ్యక్షులు శ్రీవర్ధన్, బండన్న, యూత్ అధ్యక్షుడు లచ్చన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వార్ల తిరుపతి, మాజీ సర్పంచులు ఉపాస్ సంజీవ్, పరదేశి, నాయకులు ఉన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



షెడ్డు తొలగిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఆర్ఆర్‌వో కాలనీలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలోని అక్రమ నిర్మాణాన్ని శుక్రవారం తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు తొలగించారు. కాలనీవాసులు ప్రతిఘటించినప్పటికీ అధికారులు నిర్మాణాన్ని తొలగించారు. కాగా కాగజ్‌నగర్‌రూరల్ సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల అప్పగింత

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మూడు సెల్‌ఫోన్‌లను శుక్రవారం బాధితులకు పట్టణ సీఐ శంకరయ్య అప్పగించారు. పట్టణానికి చెందిన కర్రె వెంకటేశ్, మధు శైలేంద్ర, రవికుమార్‌లు తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకొని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ నవీన్, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బాధితులకు సెల్‌ఫోన్లను అప్పగించారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

కౌటాల: మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం ఆలయ 8వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య తెలిపారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నేడు ఆలయంలో అభిషేకం, అనంతరం 9.30 గంటలకు మార్కెట్ ఏరియా నుంచి సాయిబాబా ఆలయం వరకు పల్లకి ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఆలయంలో భక్తులకు మహా ప్రసాదం పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

ఏనుగు సంచారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

దహెగాం: గత నాలుగు రోజుల నుంచి ఏనుగు జిల్లాలో సంచరిస్తు హడలెత్తిస్తున్నందున ప్రజలు వ్యవసాయ పనుల కోసం వెళ్లేటప్పుడు ఒక్కరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని ఎఫ్ఎస్‌వో బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని దిగిడ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్ మండలాల్లో ఇద్దరు రైతులపై ఏనుగు దాడి చేసి హతమార్చిందన్నారు. రాత్రి వేళల్లో ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఏనుగు కనిపిస్తే అటవీ అధికారులకు సమాచారం అందించాలన్నారు. అదే విధంగా ఏనుగు నుంచి ఎలా రక్షించుకోవాలో వారికి సూచించారు. కార్యక్రమంలో బీట్ అధికారులు సద్దాం, మధుకర్, ఏనిమల్ ట్రాకర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గువ్వలగూడలో ఉచిత వైద్యశిబిరం



మందులు అందజేస్తున్న ఎస్పీఎం ప్రతినిధులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని గువ్వలగూడ గ్రామంలో స్పర్శ ఫౌండేషన్, ఎస్పీఎం మిల్లు ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మిల్లు చీఫ్ మేనేజర్ రమేశ్‌రావు మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల కలిగే వ్యాధుల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ భానుప్రకాశ్ ఆధ్వర్యంలో వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిల్లు ప్రతినిధులు తుమ్మ రమేశ్, సదాశివ, గ్రామ స్పెషల్ అధికారి రామకృష్ణ, ఆశా వర్కర్లు ప్రమీల, రజిత తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు



ఫ్రిడ్జి ప్రారంభిస్తున్న అధికారులు

నార్నూర్: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు వైద్యాధికారి మనోహర్ అన్నా రు. శుక్రవారం సాక్షిలో సీహెచ్‌సీ లో తాగునీటి కటకట అనే కథ నం ప్రచురితమైంది. దీంతో ఐటీడీఏ ఏఈ రాథోడ్ సునీల్‌తో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. ప్రత్యమ్నాయ చర్యల్లో భాగంగా రోగులకు కూలింగ్ ఫ్రిడ్జి ఏర్పాటు చేసి శుద్ధ జలం అందించాలని హెచ్‌ఈవో నాందేవును ఆదేశించారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ఆసుపత్రి ఆవరణలో బోర్‌వెల్ వేయడం జరుగుతుందన్నారు. తాగునీటి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట హెచ్‌ఈవో రాథోడ్ తులసిదాస్, వైద్య సిబ్బంది ఉన్నారు.

లంబాడాలు ఏకతాటిపైకి రావాలి



నినాదాలు చేస్తున్న లంబాడా నాయకులు

నేరడిగొండ: లంబాడాలు ఏకతాటిపైకి రావాలని లంబాడాల ఐక్యవేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయకర్త జాదవ్ రమేశ్ నాయక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం నేరడిగొండ మండలంలోని సవర్గాం తండా పంచాయతీలో జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ నాయక్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది లంబాడాలు ఉన్నారని, ఏ పార్టీ తమను గుర్తిస్తుందో వారికే పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ఇస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బాసు నాయక్, గురుకుల టీచర్స్ సంఘం రాష్ట్ర సెక్రటరీ రమేశ్ చౌహాన్, కిరణ్, మహేశ్, కృష్ణ, విజయ్ కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

‘బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం’

ఆదిలాబాద్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బేల మండలం చప్రాల గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. ఈసందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ప్రపంచంలోనే భారతదేశం విశ్వ గురువుగా నిలిపేందుకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యకర్తలకు సైతం పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. బీజేపీలో చేరేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మురళీధర్, గజ్జు, పోశెట్టి, వెంకటేశ్, శివ, సాయికృష్ణ, విజయ్, చంద్ర పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి



వాంకిడి: తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

వాంకిడి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఆర్ఐ ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు. ఖమాన గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొడిసెల బాపు, మాజీ సర్పంచ్ పవన్, నాయకులు తిరుపతి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలో, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బాబు జగ్జీవనరామ్ పేద దళిత కుటుంబంలో పుట్టి దళితుల హక్కుల సాధన కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణారావు, ఎంపీవో అంజద్ పాషా, కార్యదర్శి భీమయ్య, నాయకులు వినేశ్, మిలింద్, రాజయ్య, ఆనంద్, రాజు ఉన్నారు.

లింగాపూర్: మండల కేంద్రంలో జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రెబ్బెన: మండల కేంద్రంలో శుక్రవారం మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ మాట్లాడుతూ కుల వివక్షతకు, సామాజిక అణచివేతలకు వ్యతిరేకంగా బాబు జగ్జీవన్‌రామ్ నిరంతర పోరాటాన్ని సాగించారన్నారు. సమానత్వ సమాజ స్థాపనకు ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ ఆయన పుట్టినరోజును సమాన దినం, సమతా దివస్‌గా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు గోగర్ల రాజేశ్, అరికిల్ల స్వామి, దుర్గం రాజేశ్, నర్సింహులు, అశోక్, ధర్మయ్య, భుజంగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కౌటాల: నివాళులర్పిస్తున్న కోనేరు కోనప్ప



కాగజ్‌నగర్‌రూరల్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

కౌటాల: దళితుల ఆశాజీవి బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తలోడి చౌరస్తాలోని బాబు జగ్జీవన్ రాం విగ్రహం వద్ద బాబు జగ్జీవన్ రాం 117 జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌తో కలిసి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల మేలు కోసం బాబు జగ్జీవన్ రాం ఎంతో కృషి చేశారన్నారు. మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ సర్పంచ్ వొజ్జల మౌనిష్, నాయకులు శైలజాగౌడ్, బ్రహ్మయ్య, వెంకన్న, దేవన్న, మధుకర్, జనార్దన్, ఆగయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌రూరల్: ఉప ప్రధానిగా, కేంద్రమంత్రిగా భారతదేశ అభివృద్ధికి బాబు జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని చింతగూడ చౌరస్తాలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రక్షణశాఖ, వ్యవసాయశాఖ, కార్మికశాఖ మంత్రిగా పనిచేసిన బాబు జగ్జీవన్‌రామ్ ఎన్నో ఉన్నత పదవులను అలంకరించారన్నారు. ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో..

పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలోని విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు లెండుగురె శ్యాంరావు, నక్క మనోహర్, తన్నీరు పోచం, మారుపాక శోభన్, రాజేశ్, నరేందర్, ప్రణయ్, పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎటుకూరి శ్రీనివాస్‌రావు, నాయకులు బిక్షపతి, శ్రావణ్, రతన్‌సింగ్, హనుమంతు, రాకేశ్, యాదగిరి, సంపత్, రమేశ్, సాంబశివరావు, ప్రకాశ్, రాజ్‌కమలాకర్ రెడ్డి, యుఎస్‌చారి, సుధాకర్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జయదేవ అబ్రహం, కార్యదర్శి ఎం.శివప్రసాద్, సుభాష్, పురుషోత్తం, సీపీఎం నాయకులు ముంజం ఆనంద్ కుమార్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు రమణయ్య, ఫారూక్, బాలరాజు, నారాయణ బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



రెబ్బెన: పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ సంతోష్



లింగాపూర్: పూలమాల వేస్తున్న అధికారులు



కెరమెరి: ఎంపీడీవో కార్యాలయంలో..

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ హర్షణీయం



సైకిళ్లతో విద్యార్థినులు

దహెగాం: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ హర్షణీయమని చినరాస్పెల్లి ప్రధానోపాధ్యాయురాలు సునీత అన్నారు. తన శిష్యుడైన లింగారావు కుమార్తె రీతిక్ష జన్మదిన సందర్భంగా చినరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దూర ప్రాంతం నుంచి వస్తున్న ఇద్దరు విద్యార్థినులకు సైకిళ్లను అందించారన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.